క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హరినామ స్మరణ



హరినామస్మరణ చేస్తున్న భక్తులు

గార: మండల పరిధిలోని రామచంద్రాపురం పంచాయతీ పెద్ద అంబటివానిపేటలో మహిళా భక్తులు నిరంతరం హరినామ స్మరణ చేస్తున్నారు. కార్తీకమాసంలో మొదలై నేటికీ నిరాటంకంగా కొనసాగుతోంది. తొలుత ముగ్గురు మహిళలు ప్రారంభించిన ఈ తిరువీధి నామ స్మరణలో రానురాను భక్తులు పెరుగుతున్నారు. ఉగాది సందర్భంగా భారీ ఎత్తున హరినామ స్మరణ చేయాలని నిర్ణయించినట్లు భక్తులు తెలిపారు.

సామాజిక సమస్యలపై దృష్టిపెట్టాలి



మాట్లాడుతున్న ప్రసాదరావు

ఎచ్చెర్ల క్యాంపస్: సామాజిక సమస్యలపై దృష్టి పెట్టాలని బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రతినిధి ఎం.ప్రసాదరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం ప్రపంచ సోషల్ వర్క్ దినోత్సవం సందర్భంగా వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వర్కు విద్యార్థులు స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేయాలని సూచించారు. ఆరోగ్య, ఆర్థిక, అసమానతలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో విజయనగరం గిరిజన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.నగేష్, సోషల్ వర్కర్ వి.ఎస్.కృష్ణ, హెచ్‌ఓడీ ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై ఇంటింటా సర్వే



సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎచ్చెర్ల: గ్రామాల్లో ప్రబలుతున్న వ్యాధులపై మురపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా సర్వే చేపట్టారు. దీర్ఘకాలిక వ్యాధులు, సంక్రమణ వ్యాధులు, అసంక్రమణ వ్యాధుల వివరాలను యాప్‌లో నమోదుచేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శివపార్వతులకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల: లావేరు మండలం గోవిందపురం పంచాయతీ ఇజ్జాడపాలెంలో గురువారం శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవుని చెట్టు వద్ద గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణం నిర్వహించిన అనంతరం మహాన్నదానం చేపట్టారు. సాయంత్రం తిరువీధి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం: మారుతున్న జీవన శైలికి అనుగుణంగా ప్రజలంతా క్యాన్సర్ వంటి ప్రమాదకర రోగాల బారిన పడకుండా ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలని జెమ్స్ వైద్యులు డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. రణస్థలంలో సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు ఆధ్వర్యంలో మొబైల్ క్యాన్సర్ పరీక్షా వాహనం ద్వారా ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ శాతం మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారని, పంచాయతీ పరిధిలో ఏ మహిళ కూడా క్యాన్సర్ బారిన పడకుండా అత్యంత ఖరీదైన పరీక్షలు జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల: లావేరు మండలం అదపాక సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ పనుల నిమిత్తం శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ గుర్రాలపాలెం, పాతకుంకాం, కొత్తకుంకాం, పైడియ్యవలస, భీమునిపాలెం, పెద్దకొత్తపల్లి, కొత్తూరుపేట, కొత్తకోట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

కళకాలం కొనసాగేలా..!

- కళారంగానికి విశేష సేవలందిస్తున్న సుమిత్రా కళా సమితి
- ఏటా క్రమం తప్పకుండా నాటిక పోటీల నిర్వహణ
- బాపూజీ కళామందిర్ వేదికగా నేటి నుంచి ప్రదర్శనలు



2024లో ఉత్తమ ప్రదర్శన నాటిక 'ఇంద్రప్రస్థం'లో దృశ్యం(ఫైల్)



శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్ వద్ద నాటిక పోటీల ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: ఒకప్పుడు ఎంతో వెలుగు వెలిగిన నాటక కళ.. సినిమాలు, టీవీల దెబ్బతో కళావిహీనంగా మారింది. కళాకారులకు సరైన ప్రోత్సాహం లేక రంగస్థలం వెలవెలబోతోంది. అయినప్పటికీ నాటక కళను ఎలాగైనా బతికించుకోవాలనే ఆరాటంతో కొందరు కళాకారులు, ఔత్సాహికులు తమవంతు కృషి చేస్తున్నారు. ఏటా క్రమం తప్పకుండా నాటిక పోటీలు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తూ కళారంగాన్ని కాపాడుకుంటున్నారు.

సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో..

కళలను పోషించేందుకు శ్రీకాకుళం నగరంలో 2014లో సుమిత్రా కళా సమితి పేరిట కళా సంస్థను ఏర్పాటు చేశారు. ఆదరణ కొరవడుతున్న నాటక రంగానికి ఊతమివ్వాలనే తలంపుతో దాతల సహకారంతో ప్రతి ఏటా రంగస్థల నాటక దినోత్సవం సందర్భంగా మూడురోజుల పాటు ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు.

కళాకారుల స్మరణలో..

సుమిత్రా కళా సమితి ఏటా ఒక ప్రముఖ కళాకారుని జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తోంది. మొదటిసారిగా 2014లో ఇప్పిలి భాస్కరరావు (బాలయ్య) పేరిట పోటీలు నిర్వహించారు. 2015లో మెట్ట అప్పారావునాయుడు స్మారక పోటీలు ఏర్పాటు చేసి సురభి సంస్థ సభ్యులను తీసుకొచ్చి వారం రోజులు పౌరాణిక ప్రదర్శనలు ఇప్పించారు. 2016 ఎంఎస్‌ఎస్ పరబ్రహ్మం స్మారక పోటీలు జరిగాయి. 2017లో బహుభాషా నాటిక పోటీల పేరిట హిందీ, తెలుగు, బెంగాలి, ఉర్దూ, పంజాబి, ఒడిశా, తమిళం, కన్నడం భాషలలో ఐదు రోజుల పాటు నాటిక పోటీలు నిర్వహించారు. 2018లో సినీ నటి, నాటక కళాకారిణి ముద్దాడ దమయంతి పేరిట, 2019లో ప్రముఖ గజల్ కళాకారుడు ప్రధాన ఆదినారాయణ జ్ఞాపకార్థం నాటిక పోటీలు జరిగాయి. 2022లో సుమిత్రా కళాసమితి పేరుతో, 2023లో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించారు. 2024లో వందేళ్ల చరిత్ర కలిగిన 'చింతామణి' నాటకాన్ని సుమిత్రా కళాసమితి సభ్యులే ప్రదర్శించి మూడురోజులు నాటిక పోటీలు నిర్వహించారు. ఈ ఏడాది హనుమంతు చిన్నరాములు స్మారకంగా నాటిక పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది ఒక రంగస్థల నటునికి సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది.

నేటి నుంచే పోటీలు

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవం పురస్కరించుకొని జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా బాపూజీ కళామందిర్ వేదికగా 21న అనకాపల్లి, షిరిడిసాయి వెల్ఫేర్ అసోసియేషన్ 'ఆశ కదరా శివ', 22న కరీంనగర్ చైతన్య కళాభారతి 'స్వప్నం రాల్చిన అమృతం', పిఠాపురం, మణికంఠ ఆర్ట్స్ 'కొత్త తరం కొడుకులు', కత్రపాడు, ఉషోదయా కళానికేతన్ 'కిడ్నాప్', 23న తాడేపల్లికి చెందిన అరవింద్ ఆర్ట్స్ 'అ సత్యం' నాటిక, సినీ, టీవీ, హాస్యనటుడు అప్పారావు ఆధ్వర్యంలో హాస్య వల్లరి ప్రదర్శన ఉంటుంది. అనంతరం బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తారు.

పదేళ్లుగా పోటీలు..



అన్ని కళలను ప్రోత్సహించడమే మా సంస్థ ఉద్దేశం. కళాకారులకు చేతనైనంత సాయం చేస్తున్నాం. 10 ఏళ్లుగా నాటిక పోటీలు నిర్వహిస్తున్నాం.మాకృషికి దాతల సహకారం మరువలేనిది.

– ఇప్పిలి శంకరశర్మ, సుమిత్రా కళాసమితి అధ్యక్షుడు

మా వంతు కృషి..



సంగీత, నాటక, సాహిత్యాలను ప్రదర్శన చేయించి భావితరాలకు వాటి గొప్పదనాన్ని తెలియజేసేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. ఇటువంటి నాటిక పోటీల నిర్వహణకు దాతలు సహకారం అందిస్తున్నారు.

– మండవిల్లి రవి, ఉపాధ్యక్షుడు, సుమిత్రా కళాసమితి

ఉగాది కానుకగా ఐఆర్ ప్రకటించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉగాది కానుకగా రాష్ట్రప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలతోపాటు ఐఆర్‌పై సీఎం చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు బి.రవి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిగ్రామంలో 1 నుంచి 5వ తరగతి వరకు ప్రస్తుతమున్న ప్రాథమిక పాఠశాలలు యథాతథంగా కొనసాగించాలని విన్నవించారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా అన్ని పంచాయతీల్లో మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీల చట్టంలో లోపాలను సవరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ విజయనగరం జోన్ పరిధిలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.కె.రావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మూడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎన్‌ఎంయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం –1 డిపో సమస్యను పరిష్కరించకుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందన్నారు. శ్రీకాకుళం–2 డిపోలో, జిల్లాలో బస్సులు తగ్గించి సిబ్బంది ఎక్కువ మంది ఉన్నారంటూ పలాస డిపోకు 9 మంది డ్రైవర్లను బదిలీ చేయడం దారుణమన్నారు. యాజమాన్యం కావాలని నేషనల్ మజ్దూర్ యూనియన్‌ను ఇబ్బంది పెడుతూ సమస్యలు పరిష్కరించడం లేదని దుయ్యబట్టారు. వీటన్నింటికీ నిరసనగా యూనియన్ జోనల్ కమిటీ పిలుపుమేరకు ఈ నెల 25న 'చలో అనకాపల్లి' నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. నిరసన కార్యక్రమంలో ఎంఎస్ రావు, నవీన్, ఎస్.వి.ఆర్.మూర్తి, కె.నరసింహులు, వి.డి.రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలానికి హద్దులు నిర్ణయించాలి



ఆలయ స్థలాన్ని పరిశీలిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వేంకటేశ్వర ఆలయానికి ప్రభుత్వం కేటాయించిన స్థలానికి హద్దులు నిర్ణయించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి ఫల్గుణరావు, జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనందరావు డిమాండ్ చేశారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి స్థలాన్ని గురువారం పరిశీలించారు. ప్రభుత్వం ఆలయానికి సర్వే నంబర్ 10లో 4.08 ఎకరాలు కేటాయించిందని, దీనికి ప్రహరీ, హద్దులు లేకపోవడం వల్ల కొందరు ఆక్రమణకు సిద్ధమవుతున్నారని, తక్షణమే రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించాలని వీహెచ్‌పీ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

సంగీత శిల్పి 'బండారు'



బండారు చిట్టిబాబు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

శ్రీకాకుళం కల్చరల్: సంగీతానికి శిల్పి వంటి మహనీయుడు బండారు చిట్టిబాబు అని గాయని డాక్టర్ మండపాక శారద అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఘంటసాల, బాలు, జి.ఆనంద్(జీబీఏ) స్వరమాధురి వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం బండారు చిట్టిబాబు సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి బండారు వద్ద సంగీతం నేర్చుకున్నట్లు గుర్తు చేశారు. లలిత సంగీత స్వరకర్తగా పేరు ప్రఖ్యాతలు సంపాదించడమే కాకుండా ఎంతోమంది గాయకులను తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తి బండారు అని కొనియాడారు. అంతకుముందు చిట్టిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జీబీఏ సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు, డాక్టర్ నిక్కు అప్పన్న, డాక్టర్ మాలతి, బండారు రమణమూర్తి, ఎం.వి.కామేశ్వరరావు, ఎల్.నందికేశ్వరరావు, డాక్టర్ ఇ.ఎస్.సంపత్‌కుమార్, ఎల్.రామలింగస్వామి, సురంగి మోహనరావు, మండా శ్రీనివాస్, ఎల్.నందికేశ్వరరావు, కిల్లాన ఫల్గుణరావు, పైడి హరనాథరావు, పులఖండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన సదస్సు



ఖరీఫ్ ప్రణాళిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రణస్థలం: 2025 ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా రైతులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని వ్యవసాయ విస్తరణ అధికారి సునీత, ఏపీఎం మాధవిలత, ప్రకృతి వ్యవసాయ జిల్లా ట్రైనర్ గోవింద రెడ్డి అన్నారు. రణస్థలం వెలుగు కార్యాలయంలో ప్రకృతి, వ్యవసాయ, వెలుగు సిబ్బందితో ఖరీఫ్ ప్రణాళికపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాతలకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు, వాణిజ్య పంటలు, ప్రకృతి నవ సారవత్రిక సూత్రాలపై పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం నవ సార్వత్రిక సూత్రాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రకృతి, వ్యవసాయ, వెలుగు సిబ్బంది ఉన్నారు.

30 నుంచి ప్రవచనాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి శ్రీమద్రామాయణ ప్రవచనాలు జరుగుతాయని నిర్వాహకులు గుమ్మా నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 30న ఉగాదిని పురస్కరించుకొని తెన్నేటి విక్రమశర్మ పంచాంగ శ్రవణం, 31న 'యత్ర భ్రాతా సహోదరః' అంశంపై డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, 1న 'రామయణం ధర్మస్వరూపం'పై ఇప్పిలి రామకృష్ణశర్మ, 2న 'సర్వమానవాళికి ఉత్తరగతులకు ఉత్తర కాండం'పై బంకుపల్లి రమేష్, 3న 'జానకీమాత పాతివ్రత్యం–నేటి యువతకు సందేశం' పై రంప సాయికుమార్, 4న 'భక్త సులభుడు శ్రీరాముడు'పై సుసరాపు చంద్రశేఖరశర్మ, 5న 'భరతుని భాతృభక్తి'పై పైడి హరనాథరావు ప్రవచనాలు, 6న 'రఘువంశం' పుస్తకావిష్కరణ, 12న శ్రీరామదర్బార్‌లో పండితులు, భక్తుల సమక్షంలో శ్రీరాముని గుణాలను కీర్తించడం జరుగుతుందనివివరించారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి కోదండ రామాలయం ప్రాంగణంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని, అందరూ హాజరుకావాలని కోరారు.

కేజీబీవీలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

గార: మండలంలోని శాలిహుండం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం 2025–26లో మిగులు సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ బైపీసీ విభాగంలో 40 చొప్పున సీట్లు ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చని పేర్కొన్నారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 94922 98197 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

పొన్నాడ కేజీబీవీలో..

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని పొన్నాడ కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి సూర్యకళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్మీడియట్, 7,8,9,10 తరగతుల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో మార్చి 22 నుంచి ఏప్రిల్ 11లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పిచ్చుకలను కాపాడుకుందాం



అవగాహన కల్పిస్తున్న గోవిందరావు

ఎచ్చెర్ల: ఒకప్పుడు అధిక సంఖ్యలో ఉండే పిచ్చుకలు ఇప్పుడు కనుమరుగవుతుండటం బాధాకరమని నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కో–ఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తరిస్తున్న పట్టణ సంస్కృతి, అడవులు పంటచేలు తగ్గడం, పెరుగుతున్న సాంకేతిక కాలుష్యం, సెల్‌టవర్ వల్ల కలిగే రేడియేషన్ పిచ్చుకలు తగ్గిపోవడానికి కారణమని చెప్పారు. పిచ్చుకలు పంటలకు నష్టాన్ని కలిగించే క్రిమికీటకాలను ఆహారంగా తీసుకొని రైతుమిత్రులుగా సహాయపడతాయని వివరించారు. వేసవిలో మట్టిపాత్రలో నీటిని పక్షులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉరిటి శ్రీనివాసరావు, పడాల తమ్మినాయుడు, కూన చినపెంటయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాచుతో నిండినది









శ్రీకాకుళం నగర పరిధిలో పొన్నాడ బ్రిడ్జి వద్ద నాగావళి నది నాచు, గుర్రపు డెక్కతో నిండిపోయింది. ఉన్న కొద్దిపాటి నీరు ఇలా మారడంతో పశువులు దాహార్తిని తీర్చుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు మండుటెండలు, మరోవైపు నీరు తాగే దారి లేక అవస్థలు పడుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు ప్రభుత్వాలు కట్టుబడి పనిచేయకుంటే అటు ప్రజలు ఇటు ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్ని ప్రయోజనాలను, బకాయిలను సకాలంలో నెరవేర్చుతామని హామీలనిచ్చి.. తీరా అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గురువారం శ్రీకాకుళంలోని దాసరి క్రాంతిభవన్‌లో ఏర్పాటుచేసిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా జీతాలు, సీపీయస్ మ్యాచింగ్ గ్రాంట్ అరకొర బకాయిలు తప్ప ఉద్యోగులకి చేసిందేమీ లేదన్నారు. అన్ని బకాయిలు కలిపి దాదాపు రూ.32 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, వీటిపై స్పష్టమైన ప్రకటన రాకపోవడం విచారకరమన్నారు. కాలపయాపన చేస్తున్నారు తప్ప ఒక్క డీఏ కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ మాట్లాడుతూ 11వ వేతన సవరణ గడువు ముగిసి 21 నెలలు గడుస్తున్నా 12వ వేతన సవరణ కమిషన్ చైర్మన్ నియామకమే జరగలేదని, ఎప్పుడిస్తారో సీఎం చంద్రబాబు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కనీసం ఐఆర్ ప్రకటన కూడా లేదని, పెండింగ్ బకాయిలు, పెండింగ్ డీఏలు ఇవ్వలేదని గుర్తుచేశారు. ఏపీజీఎల్ఐ, పీఎఫ్ లోన్లు, రిటైర్మెంట్ చెల్లింపులు నెలలు తరబడి నిలిచిపోయాయని.. వీటిపై చర్చించేందుకు ప్రభుత్వం తమకు నిమిషం కూడా సమయమే ఇవ్వడంలేదని వాపోయారు. ఇలాగే మొండివైఖరితో వెళ్తే ప్రజలు, ఉద్యోగుల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చింతల రామారావు, కె.శ్రీనివాసరావు, ఎం.మురళి, జి.శ్రీను, సీహెచ్ జగన్, డీవీఎన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి: డీఐజీ



జిల్లా పోలీసు కార్యాలయంలో డీఐజీ గోపినాథ్ జెట్టి వార్షిక తనిఖీ

శ్రీకాకుళం క్రైమ్ : పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని విశాఖపట్నం రేంజి డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం, జిల్లా నేర రికార్డు బ్యూరో (డీసీఆర్బీ), పాస్‌పోర్టు విభాగాలను సందర్శించారు. కార్యాలయంలోని వివిధ సెక్షన్లు, అధికారులు, సిబ్బంది, వారు నిర్వహించే రికార్డులు, పోలీసు సిబ్బంది అర్జీలు, ఉన్నత పోలీసు అధికారులు, కార్యాలయాలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు, రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చే స్టార్ ఆర్టికల్స్ వివరాలు, రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. అదే విధంగా డీసీఆర్బీ, స్పెషల్‌బ్రాంచి, పాస్‌పోర్టు సెల్ అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.

సంక్షిప్తంగా..

సునీతా విలియమ్స్‌కు అభినందనలు

శ్రీకాకుళం అర్బన్: అంతరిక్షం నుంచి తొమ్మిది నెలల తర్వాత సురక్షితంగా భూమిపైకి చేరుకున్న వ్యోమగామి సునీతా విలియమ్స్ బృందానికి గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు.ఇది ముమ్మాటికీ చారిత్రక ప్రయాణమని కొనియాడారు.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న షిరిడీ సాయిబాబా

ఎచ్చెర్ల: లావేరు మండలం బెజ్జిపురం పంచాయతీ బొంతుపేటలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న షిరిడీసాయి మందిరం ఆరో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు వాళ్లే గోవిందనాయుడు, జగదీష్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సామూహిక సత్యవ్రతాలు, పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు.

నేడు సామాజిక తనిఖీల ప్రజావేదిక

జి.సిగడాం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24లో చేపట్టిన వివిధ రకాల ఉపాధి పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, సర్పంచ్‌లు, ప్రజా నాయకులు హాజరుకావాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం

జి.సిగడాం: దేవరవలసలో ఈ నెల 18న జరిగిన అగ్ని ప్రమాదంలో అప్పలదాస్, అప్పారావు, సూర్యారావులకు చెందిన 100 క్వింటాళ్ల ధాన్యం, గడ్డివాములు కాలిబూడిదవ్వడంతో బాధితులను ఎచ్చెర్ల జనసేన పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ విశ్వక్‌సేన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు భూపతి అర్జున్, కార్యదర్శి తాళాబత్తుల పైడిరాజు పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పొగిరి అప్పలనాయుడు, పైల శివ, శ్రీను, గోవింద, దుర్గారావు, సతీష్ పాల్గొన్నారు.

ఆదుకోకుంటే ఉద్యమమే

పెదవేగి : కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కోకో రైతుల రాష్ట్ర సదస్సు హెచ్చరించింది. గురువారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. బొల్లు రామకృష్ణ, బోళ్ల సుబ్బారావు, ఈడ్పుగంటి శ్రీనివాసరావు అధ్యక్షత వ్యవహరించిన ఈ సదస్సులో కోకో రైతుల సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు మాట్లాడుతూ కోకో గింజల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 75 వేల ఎకరాల్లో కోకో తోటల సాగు ఉందని, ఏలూరు జిల్లాతో పాటు తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకో అంతర పంటగా ఉందని వివరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం : 9951602845, 9951602849, 9912220367, 9705444191, 9010299083
ఎచ్చెర్ల : 9951602849
Office mail : sklmadvt@gmail.com